వరద తగ్గింది.. బురద మిగిలింది

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాం తండాను ఆకేరువాగు ముంచెత్తింది. ఇంట్లోకి వచ్చిన వరద తగ్గిన తర్వాత బురదలో చిందరవందరగా పడి ఉన్న సామాగ్రి, పాడైపోయిన గృహోపకరణాలు, వస్తువులను చూస్తున్న మహిళ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాం తండాలో తన ఇంటిని ఆకేరువాగు వదర ముంచెత్తడంతో తడిసిన బియ్యాన్ని చూపిస్తున్న వృద్ధుడు

లోకం పోకడ



బీఆర్ఎస్ హయాంలో 2023 జూలై 27న భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిని వరద ముంచెత్తడంతో హెలికాప్టర్ సాయంతో సురక్షిత ప్రాంతాలకు బాధితుల తరలింపు

అంతులేని విషాదం!

- కేసీఆర్‌లా స్పందించి ఉంటే నష్టం తగ్గేది
- సహాయక చర్యల జాప్యానికి భారీ మూల్యం
- వాతావరణశాఖ హెచ్చరికలు బేఖాతరు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలతో అనేక జిల్లాల్లో అంతులేని విషాదం అలముకున్నది. ప్రకృతి వైపరీత్యాలు చెప్పిరావు. కానీ వాతావరణశాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకొని యుద్ధప్రాతిపదికన ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే ఇంతలా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేది కాదనే అభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. సర్కార్ సమయానికి స్పందించకపోవడం వల్ల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ సహా అనేక జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. గతనెల 27న వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని, తమకు సకాలంలో సహాయం అందుంటే ఇంత నష్టం జరిగేది కాదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. గతంలో కేసీఆర్ సర్కార్ చేపట్టిన సహాయక చర్యలు, ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న వైఖరి పట్ల రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చ సాగుతున్నది.

అప్పుడలా.. ఇప్పుడిలా

2020, 2022, 2023లో భారీ వర్షాలు రికార్డు సృష్టించాయి. నాడు కేసీఆర్ ప్రగతిభవన్‌ను వార్‌రూంగా మార్చి, కంట్రోల్ రూంగా చేసి ఎప్పటికప్పుడు భాగస్వామ్య శాఖలను అప్రమత్తం చేశారు. దశాబ్దం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆ ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల కన్నా అధిక వర్షపాతం కురిసింది. యుద్ధప్రాతిపదికన కడెం ప్రాజెక్టు కింద ఉన్న 12 గ్రామాలను ముందస్తుగా ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్ల వందలాది మంది ప్రాణాలను రక్షించటమే కాకుండా కడెం ప్రాజెక్టును వరద ముంపు నుంచి కేసీఆర్ ప్రభుత్వం రక్షించగలిగింది. 2020లో కురిసిన భారీ వర్షాలకు తక్షణం కేంద్రసాయం కింద ఆదుకోవాలని రూ. 1350 కోట్లు ఇవ్వాలని వానలు కురుస్తున్న సమయంలోనే అంచనాలు వేసి నివేదించినా కేంద్రం నుంచి ఒక్కపైసా రాకున్నా రాష్ట్రప్రభుత్వమే ఆదుకున్నది.

ప్రభుత్వంపై విమర్శలు

భారీ వర్షాలతో అతలాకుతలమైన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందన్న విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించలేకపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన తీరు విమర్శలకు తావిస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రులు సహాయక చర్యలను సైతం రాజకీయ శిబిరాలుగా మార్చుకోవడం దారుణంగా కనిపిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట జిల్లా సమీక్ష సమావేశం తీరు, ఖమ్మం బాధితులను పరామర్శిస్తున్న సందర్భంగా సీఎం సహా మంత్రులు ప్రవర్తించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆపత్కాలంలో కండువాలకు, ఫొటోలకు అంత ప్రాధాన్యం ఎందుకని వరద బాధితులు సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాడు హెలికాప్టర్లు తెప్పించిన కేసీఆర్

అర్ధరాత్రి దొంగ దెబ్బతీసినట్టు వాన పొటెత్తడంతో భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిని వరద నుంచి రక్షించిన వైనం రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం చర్చనీయాంశమైంది. జూలై 27, 2023లో కురిసిన అతిభారీ వర్షం వల్ల మోరంచపల్లి వాసులు తిరిగి లోకాన్ని చూస్తామని కలలో కూడా అనుకోలేదని ఆ ఘటనను గుర్తుచేసుకుంటున్నారు. మోరంచపల్లి వాగు తెగిపోవడం వల్ల ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. కేసీఆర్ కేంద్రం రక్షణశాఖతో సకాలంలో సంప్రదింపులు జరిపి ప్రత్యేక హెలికాప్టర్లు, పడవలను తెప్పించి 900మందిని గంటల వ్యవధిలోనే సురక్షిత ప్రాంతాలకు తరలించిన దృశ్యాలు కండ్ల ముందు తిరుగుతున్నాయి. చరిత్ర లో కనీవినీ ఎరుగని కుంభవృష్టితో ఉమ్మడి వరంగల్ అతలాకుతలమైంది. 108 గ్రామాలు ముంపులో చిక్కుకున్న ఉదంతాన్ని జనం గుర్తుచేసుకుంటున్నారు.

సర్కారు విఫలం!

సహాయక చర్యల కల్పనలో వెనుకబడిన రాష్ట్ర ప్రభుత్వం

- భారీ వర్షాలకు 33 మంది మృతి.. 16 మందే అంటున్న ప్రభుత్వం
- వరద ప్రాంతాల్లో బాధితుల ఆగ్రహం
- సోషల్ మీడియాలో నెటిజన్ల ఫైర్
- ఆదివారం సీఎం ఎక్కడంటూ ప్రశ్నలు

మహబూబాబాద్ జిల్లాలోని ఆకేరు వాగుపై వరద ఉధృతికి వంతెన కొట్టుకుపోవడంతో నిచ్చెనల సాయంతో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వర్షాలు, వరదలతో రాష్ట్రం అతలాకుతలం అవుతున్నది. ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఖమ్మం జిల్లా ఇంకా వరద ముంపులోనే ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి, ముగ్గురు మంత్రులు అక్కడే తిష్ట వేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. సహాయక చర్యలు మెరుగుపడలేదని, తమకు సహాయం అందలేదని బాధితులు ఆక్రోశిస్తున్నారు. సూర్యాపేటలోనూ ఇదే పరిస్థితి. వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 31 మంది వరకు మరణించినట్టు చెప్తున్నారు. 16 మంది మాత్రమే మరణించారని ప్రభుత్వం ప్రకటించింది. 5,700 గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయినట్టు పంచాయతీరాజ్‌శాఖ తెలిపింది. 117 గ్రామాల్లో పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయని, 80 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయని అధికారులు చెప్తున్నారు. 150 ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయని, 500 రోడ్లు భారీగా దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. లక్షన్నర ఎకరాల్లో పంటనష్టం సంభవించిందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తుండగా, 4-5 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లిందనే అంచనాలు ఉన్నాయని, సమగ్ర సర్వే చేయాలని సీఎం చెప్పడం గమనార్హం.

ముందుచూపులేక తీవ్ర నష్టం

రాష్ట్రంలో వరద ముంపునకు, ప్రాణనష్టానికి ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమనే వాదన వినిపిస్తున్నది. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని, ఏపీ, తెలంగాణకు వర్ష ముప్పు పొంచి ఉన్నదని వాతావరణశాఖ ముందుగానే హెచ్చరించింది. ప్రస్తుత టెక్నాలజీ ప్రకారం ఒక జిల్లాలోని ఏ ప్రాంతంలో ఎక్కువ వర్షం కురిసే అవకాశం ఉన్నదో కూడా అంచనాలు ఇస్తుంటారు. దీనిని బట్టి ముంపు ప్రాంతం ఎక్కడ ఉంటుందో, వరదలు ఎక్కడ సంభవించే అవకాశం ఉన్నదో ముందస్తుగా అంచనా వేసే అవకాశం ఉంటుంది. అయినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. గతంలో వర్ష, వరద ప్రభావిత ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు, ఫైర్ తదితర వ్యవస్థలను అప్రమత్తం చేసి రక్షణ చర్యలు చేపట్టేవారని, ఎక్కడ చిన్న వరద, వాన వచ్చినా వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు హెలికాప్టర్లను రంగంలోకి దించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఎందుకు లేదని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ సీఎంతోపాటు ఇద్దరు మంత్రులున్న ఖమ్మం జిల్లాలో సహాయక చర్యలకు ఒక్క హెలికాప్టర్ కూడా రాలేదని ఉదహరిస్తున్నారు.

'బురద' రాజకీయం

సీఎం రేవంత్‌రెడ్డి వరదల వేళ బురద రాజకీయం చేస్తుండటంపై ప్రజలు, నెటిజన్లు మండిపడుతున్నారు. ఆదివారం ఉదయం రాష్ట్రంలో వరద ప్రభావం మొదలైన సంగతి తెలిసిందే. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఎక్కడా బయట కనిపించలేదు. కనీసం సచివాలయానికి రాకుండా ఇంటికే పరిమితమయ్యారు. మంత్రులకు ఫోన్లు చేసి ఆదేశాలు ఇచ్చినట్టు ప్రకటనలు విడుదల చేశారు. సోమవారం ఉదయం మాత్రం హడావుడిగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లి సమీక్ష నిర్వహించారు. తర్వాత సూర్యాపేట, ఖమ్మం పర్యటనలకు బయలుదేరి వెళ్లారు. ఆదివారమే ఎందుకు ప్రత్యక్షంగా పర్యవేక్షించలేదని ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇక సోమవారం సూర్యాపేటలో సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నా పట్టించుకోకుండా, అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్‌ను విమర్శించారు. దీంతో 'వరదల వేళ బురద రాజకీయం ఏమిటి?' అంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. ఖమ్మం పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా వేసుకోవడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రెస్‌మీట్ సమయంలో అందంగా అలంకరించిన వేదికపై కూర్చోవడం, కాంగ్రెస్ ప్రచార రథంలో సీఎం, మంత్రులు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా వరదలకు 33 మంది మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలు, వరదలతో 33 మంది వరకు దుర్మరణం చెందినట్టు అనధికారికంగా తెలిసింది. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడంతో ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 9 మంది మృత్యువాతపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8 మంది చనిపోయారు. ఫోన్లు చేసినా కాపాడేవారులేక వరదల్లో కొట్టుకుపోయినవారే అత్యధికంగా ఉన్నారు. నల్లగొండ, సూర్యాపేట, నారాయణపేట, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ఇద్దరు చొప్పున, కామారెడ్డి, పెద్దపల్లి, కరీంనగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నిర్మల్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతిచెందారు.

దుందుభి నదిలో చిక్కుకున్న చెంచులు

అచ్చంపేటరూరల్, సెప్టెంబర్ 2: చేపల వేటకు వెళ్లిన తొమ్మిది మంది చెంచులు దుందుభి నదిలో చిక్కుకున్న ఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మనపల్లి సమీపంలోని గుర్రలబండ వద్ద చోటుచేసుకున్నది. నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లికి చెందిన తొమ్మిది మంది చెంచులు సోమవారం గుర్రలబండ వద్ద ఉన్న దుందుభి నదిలోకి చేపల వేటకు వెళ్లారు. నదిలో నీటి ఉధృతి పెరగడంతో అందులో చిక్కుకున్నారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ యువకుల సహకారంతో సోమవారం సాయంత్రం డ్రోన్‌లతో ఆహార పదార్థాలు అందించారు. మంగళవారం ఉదయం చెంచులను బయటకు తీసుకొస్తామని డీఎస్పీ తెలిపారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	32.6°c	24.2°c
మెదక్	30.8°c	21.1°c
కరీంనగర్	28.0°c	25.0°c
వరంగల్	28.0°c	24.0°c
ఖమ్మం	28.0°c	23.0°c
నల్లగొండ	27.0°c	23.0°c
రంగారెడ్డి	26.1°c	19.9°c
నిజామాబాద్	24.8°c	22.2°c
మహబూబ్‌నగర్	24.2°c	21.3°c
హైదరాబాద్	23.8°c	21.4°c

మరో ఐదురోజులు వర్షాలు

- 5 నాటికి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఈ నెల 5నాటికి వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి రాబోయే ఐదు రోజులు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వానలు కురిసే అవకాశముందని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

11 జిల్లాలు అప్రమత్తం : సీఎస్

రాష్ట్రంలోని దాదాపు 11 జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ఆయా జిల్లా కలెక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతి కుమారి సూచించారు. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించే విషయం జిల్లా కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టుల లోతట్టు ప్రాంతాల ప్రజలను సరక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మల్ కలెక్టర్‌ను ఆదేశించారు.

బస్సులు, రైళ్లు రద్దు

భారీ వర్షాల కారణంగా టీజీఎస్ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 1447 బస్సు సర్వీసులను రద్దు చేసినట్టు తెలిపింది. ఆదివారం రాత్రి వరకు 877, సోమవారం ఉదయం నుంచి మరో 570 బస్సులను రద్దు చేసింది. ఖమ్మం, విజయవాడ, మహబూబాబాద్ వైపుగా వెళ్లే రోడ్లన్నీ జలమయం కావడంతో ఆయా మార్గాల్లో బస్సులను పూర్తిగా రద్దు చేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లాకు యథావిధిగా బస్సులను నడుపుతుండగా, వికారాబాద్‌లో 212 బస్సులకు బదులు 50 మాత్రమే నడుపుతున్నట్టు చెప్పారు. అలాగే, భారీ వర్షాలతో 432 రైళ్లు రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. 140 రైళ్లు దారి మళ్లించగా, మరో 13 రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్టు తెలిపింది. సోమవారం ఉదయం మరో 96 రైళ్లను రద్దు చేసినట్లు వెల్లడించారు.

ఏపీకి తప్పని భారీ వర్షాలు..

సెప్టెంబర్ 5 నాటికి ఏర్పడే అల్పపీడనం ప్రభావంతో ఏపీలో కోస్తా తీరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ పేర్కొన్నది. వరద ప్రాంతాల్లో డ్రోన్లతో ఆహారం సరఫరా చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ట్రయల్ రన్‌ను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షించారు. ఈ డ్రోన్లు దాదాపు 8 నుంచి 10 కిలోల వరకు ఆహారం, మెడిసిన్ , తాగునీరు వంటివి తీసుకెళ్తాయనే అంచనాకు వచ్చినట్టు సమాచారం. చిట్టినగర్‌లోని విజయ డెయిరీ నీట మునిగి 70 కోట్ల నష్టం వాటిల్లినట్టు చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు.

ఆపద రక్షకులెక్కడ?

- బాధితులను ఆదుకొనే దిక్కే లేదు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతుండటంతో భవనంపై కూడా తమ ప్రాణాలకు రక్షణ లేదని భావించిన ఓ మహిళ తన నలుగురు పిల్లలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆదివారం ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు సహాయం కోసం హాహాకారాలు చేసింది. ఎంత మొత్తుకున్నా వారిని ఆదుకొనే నాథుడే కరువయ్యాడు. ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన ఘటన ఇది. చివరికి ఆ మహిళ మధిరలోని తమ బంధువులకు కాల్ చేయగా.. అక్కడినుంచి వచ్చిన గజ ఈతగాళ్లు వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మరో ఘటనలో మున్నేరు బ్రిడ్జిపై 9 మంది మధ్యాహ్నం ఎప్పుడో చిక్కుకుంటే.. రాత్రి పది గంటల వరకూ వారిని కాపాడేవారే లేకపోయారు. ఆఖరికి ఓ జేసీబీ డ్రైవర్ తన ప్రాణాలకు తెగించి ఆ తొమ్మిదిమందిని కాపాడారు. మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో కూడా వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వ్యవస్థ మొద్దు నిద్ర పోయినట్టు జరిగిన ఘటనలు తెలియజేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే అధికార యంత్రాంగం ఎందుకు మొద్దునిద్రలోకి జారుకుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖమ్మంలో ముగ్గురు మంత్రులు, పోలీసు, అగ్నిమాపక వ్యవస్థ పూర్తిగా చేష్టలుడిగి బాధితులను ఆదుకోవడంలో చేతులెత్తేసింది. వరద ఉధృతికి ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకొని ఆర్తనాదాలు చేశారు. అధికారులు మాత్రం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వరద ప్రాంతాలకు తరలించలేదు.

విపత్తులోనూ రేవంత్ రాజకీయం

- వరద సాయం చేయకుండా బీఆర్ఎస్‌పై సీఎం బురద
- రేవంత్ మాటలను ప్రజలు అసహ్యించుకుంటున్నరు
- ఆయన చీప్ మినిస్టర్ అని మరోసారి నిరూపించుకున్నడు
- ప్రభుత్వ వైఫల్యంతోనే 31మంది చనిపోయిండ్రు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపాటు

మెదక్ జిల్లా చేగుంటలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/ చేగుంట : వరద సాయం చేయాలని కోరితే సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై బురద జల్లుతున్నాడని, ముఖ్యమంత్రి హోదాను దిగజార్చి విపత్తును కూడా రాజకీయం చేయడం దురదృష్టకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 'దుఃఖంలో ఉన్న ప్రజలకు భరోసా కల్పించాల్సింది పోయి సీఎం ప్రతిపక్షాల మీదపడి ఏడుస్తున్నడు. రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు అసహ్యించుకుంటున్నరు. ఆయన చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్ అని మరోసారి నిరూపించుకున్నడు' అంటూ ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలపై నిందలు వేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను సీఎం ఒప్పుకొన్నాడని దుయ్యబట్టారు. వర్షాలను లెక్కచేయకుండా ఏపీలో 74 ఏండ్ల సీఎం బయట తురుగుతుంటే, మన సీఎం ఇంట్లో ఫిడేల్ వాయించాడని ఎద్దేవాచేశారు. రాజకీయాలు పక్కనబెట్టి ప్రజలకు భరోసా ఇచ్చేలా మాట్లాడాలని సూచించారు. మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి హరీశ్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు, వరదలతో 16మంది చనిపోయినట్టు ప్రభుత్వ లెక్కలు చెప్తున్నా మొత్తం 31 మంది చనిపోయినట్టు తమకు సమాచారం ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇన్ని మరణాలు సంభవించాయని విమర్శించారు. వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా ప్రభుత్వం మొద్దునిద్ర పోయిందని, ముందస్తు చర్యల్లో విఫలమైందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు విఫలమయ్యారని, అక్కడ కాంగ్రెస్‌కు తొమ్మిది సీట్లిస్తే తొమ్మిది మందిని కూడా కాపాడలేక పోయారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వరదల్లో చనిపోయిన వారికి రూ.25 లక్షలు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఖమ్మంలో సాయమడిగిన వరద బాధితులపై పోలీసులు లాఠీ చార్జీ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులమంతా కలిసి వరద బాధితులకు విరాళాలు అందిస్తామని చెప్పారు.

ఇంట్లో వరదనీరు.. కంట్లో కన్నీరు

'ఇంట్లో వరద నీరు, కంట్లో ఎడతెగని కన్నీరు.. వరద సృష్టించిన విలయాన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని' అని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికీ సహాయక చర్యలు అందలేదని జనం ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం మనసుపెట్టి చర్యలు చేపట్టాలని, వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.పదివేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. భారీ వర్షాలను లెక్క చేయకుండా ప్రాణాలు పణంగా పెట్టి విధి నిర్వహణలో తలమునకలైన విద్యుత్తు ఉద్యోగులను హరీశ్ అభినందించారు.

భట్టి మాటలు శోచనీయం

ప్రజలు ఆపదలో ఉంటే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాజకీయాలు మాట్లాడటం శోచనీయమని ఎక్స్‌వేదికగా హరీశ్ విమర్శించారు.' మీలాగ మేం విమర్శలు చేయలేక కాదు, ఇలాంటి కష్టకాలంలో ప్రజలను ఆదుకోవడం ముఖ్యం, ప్రజలు మీమీద మండిపడుతున్నరు.. ముందు సహాయక చర్యలపై దృష్టి పెట్టండి' అని హితవుపలికారు.

నాగేశ్వర్‌పై బీజేపీ బెదిరింపులను ఖండిస్తున్నా

మాజీ ఎమ్మెల్సీ, రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కొందరు బీజేపీ నాయకులు చేస్తున్న అనుచిత దాడి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హరీశ్ పేర్కొన్నారు. రాజకీయ విమర్శలను రాజకీయ విమర్శలతోనే ఎదుర్కోవాలని, అందుకు భిన్నంగా భౌతిక దాడులు చేస్తామని, బయట తిరగనివ్వబోమని బెదిరిస్తూ తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా దుర్భాషలాడటం గర్హనీయమన్నారు. ఈ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు.

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో ఆకేరువాగు ఉధృతికి కూలిపోయిన ముల్కలపల్లి బ్రిడ్జి